విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
ఆదివారం 5 జూలై 2026

# 2029 తర్వాత అమలయ్యేది తోపుదుర్తి రాజ్యాంగమే..



అనంతపురం, జులై 4 (అనంత ప్రభ)
'2029లో జగనన్న సీఎం అయ్యేదాకా ఎన్ని త్యాగాలైనా చేస్తాం. ఆ తర్వాత జగనన్న మాటకూడా వినం. 2029 తర్వాత ఇక్కడ అమలయ్యేది తోపుదుర్తి రాజ్యాంగమే ఖబడ్దార్' అంటూ రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హెచ్చరించారు. నిన్నటి రోజు టీడీపీ ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. శనివారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడిపత్రి వైపు నంచి వస్తున్న సమయంలో జరిగిన ఘటన, ఏ నేపథ్యంలో వరుస ఘటనలు జరుగుతున్నాయనేది నేను విశదీకరించా. మే14న మంత్రి నారా లోకేష్ జిల్లాకు వచ్చినప్పటి నుంచి నిన్నటి రోజు (జూలై 3) వరకు జరిగిన ఘటనను వివరించా.

బాబూ రాజు...చెప్పుల షాపులో పని చేసేటప్పటి నుంచి ఈరోజు లోకేష్‌కు బినామీ వరకు ఎదిగిన వైనం అందరికీ తెలుసు. భూస్వాముల ఇళ్లల్లో పెట్టి కోట్లాది రూపాయల కాంట్రాక్ట్ పనులు చేసిన మేము ఇప్పటికీ బాడుగ ఇళ్లల్లో ఉన్నామని చెబుతుంటే ఎవరూ నమ్మడం లేదు. కనీసం నువ్వైనా నమ్మావు రాజు థ్యాంక్స్. తాను ఉంటున్న ఇంటికి పదేపదే బాడుగ కట్టలేదని చెప్పావు. నువ్వయినా నమ్మావు తమ్ముడు.

ఎమ్మెల్యే అయిన మూడు నెలలకు సాక్షి ఆఫీసు పక్కన 7 కోట్ల విలువ చేసే విల్లా ఎలా కొన్నావు ఎంఎస్ రాజు?. నీ పార్టీ కార్యాలయ భవనం కూడా కొన్నావంట కదా?, బెంగళూరులోనూ ఏదో ప్రాపర్టీ కొన్నావంట కదా బాబు రాజు. నువ్వు మామూలోడివి కాదు. హైబ్రీడ్ రాజువు. అందుకే నాలుగు పదవులు. టీటీడీ బోర్డు మెంబరు, ఎమ్మెల్యే, ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా పార్టీ అధ్యక్షుడు. గుండుమల తిప్పేస్వామికి గుండు కొట్టించి పక్కన కూర్చోబెట్టాడు లోకేష్. జనంలో నుంచి పుట్టాం. జనంలోనే ఉంటాం. జనం కోసం చస్తాం. నాలాంటోడు టికెట్ కోసం యాచించడు. కాంట్రాక్ట్ పనులు చేసేవారు టికెట్ల కోసం యాచించాలి. నా నియోజకవర్గంలో ఏ సందులోకి వెళ్లినా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గురించి చెబుతారు.

నువ్వేంట్రా బాబూ పరిటాల శ్రీరామ్...ధర్మవరంలో ఉన్నావు. నీపనేంటో చేసుకుంటున్నావు. అగన్‌వత్తుల గురించి మాట్లాడుతున్నావు. చమన్‌సాబ్ అనుకుంటివా అగర్‌వత్తులు పెట్టేదానికి. నాకెందుకురా గన్‌మెన్లు. బుల్లెట్లు ఎన్ని వాడారో గన్‌మెన్లు ప్రభుత్వానికి లెక్క చెప్పాల. నేను లెక్కలు చెప్పాల్సిన అవసరం లేదు. మరి నాకెందుకు గన్‌మెన్లు. సునీతమ్మ చనిపోయిన భర్త గురించి ఏళ్ల తరబడి చెప్పుకుంటూ రాజకీయం చేస్తోంది. పరిటాల రవి పేరు చెప్పుకోంది ఆమెకు పూట గడవదు. సునీతమ్మా...నీ భర్త నీకలలోకి రావాలి కాని నాకలలోకి ఎందుకు వస్తాడు. ఆయన్ను మరిచిపోయావా? కలలోకి కూడా రానంతగా మరిచిపోయావా?. పిచ్చికుక్క గురించి మాట్లాడతారా? పిచ్చికుక్కలు కనిపిస్తే వాటిని మునిసిపాలిటీ వారు చంపి పూడ్చుతుంటారు. పూడ్చిన ప్రతి పిచ్చికుక్క కలలోకి వస్తుందా? నీ కుక్కపిల్లను ధర్మవరంలో కట్టేశావు. నీ ఇంట్లో కట్టేసుకో. ఎందుకంటే మునిసిపల్ వ్యాన్లు ఈ మధ్య కాలంలో ధర్మవరంలోనూ తిరుగుతున్నాయి.

-- సురేంద్రబాబు నీ చరిత్ర ఏంది. ఏఊరు నీది. కేరాఫ్ ప్లాట్‌ఫాం గాడివి నువ్వు. రాచానపల్లిలో సిమెంట్ బ్రిక్స్ ప్లాట్‌ఫాం వేసుకొనింటివి. అక్కడి నుంచి ఈరోజు వేయి కోట్ల ఆస్తిపరుడి దాకా ఎదిగావు. వందల కోట్ల ఆస్తులు, వేల కోట్ల బ్యాంక్ బ్యాలెన్సులు ఎక్కడి నుంచి వచ్చాయి. నువ్వు కూడా మాట్లాడుతున్నావు. నియోజకవర్గంలో ఒక్క రూపాయి నాకు ఆదాయం వద్దు అని చెప్పి ఓట్లు వేయించుకున్నావు. ఈరోజు 356 బెల్ట్‌షాపులు పెట్టి ఒక క్వాటరు మీద 50 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నావు. వందల కోట్లు కొల్లగొడుతున్నావు.

-- మా ఎంపీలు కేంద్రం నుంచి తెచ్చిన వర్కులను చేసిన నువ్వు సంపాదించుకుని అదే ఎంపీ రంగయ్యపై నిలబడి వందకోట్లు ఖర్చు చేసి గెలిచావు. 2014లో మీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 90 కోట్ల హంద్రీనీవా పనులను చేజిక్కించుకుని సుమారు 200 కోట్లు బిల్లులు చేసుకుంటివి. నష్టంలో పనులు తీసుకున్న త్యాగమూర్తివి అయితే 90 కోట్ల పనులకు 200 కోట్ల బిల్లులు ఎట్ల చేసుకుంటివప్పా? జగన్‌మోహన్‌రెడ్డి నిన్ను గేటుకూడా దాటినవ్వలేదు. నువ్వు ప్రకాష్ రెడ్డి పనులు కొట్టేశావు. నువ్వు రావద్దని చెప్పాడు. ఎన్నికల ముందు మావాళ్లు కొందరికి చందాలిచ్చి వారిద్వారా అన్ని ప్రయత్నాలు చేశావు. ఏదీ కుదరకపోతే నావద్దకు వచ్చావు. ఇది నీబతుకు.

36వ ప్యాకేజీ పనులు ఆరోజు 40 కోట్లు మిగులు పనికి ఈరోజు నాలుగు వందాల నాలుబాయ్ కోట్లకు టెండరు పిలిపించుని పనులు తీసుకున్నావు. ఇదికాకుండా మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులు కూడా తీసుకున్నావు. వెడల్పు, కాలువ నిర్మాణానికి నాలుగురెట్ల అంచనాలు వేసుకున్నారు. డెబ్భై రూపాయల మట్టి పనికి మూడు వందాల డెబ్భై రూపాయలు పెట్టుకున్నారు. ఈ పనుల్లో లోకేష్‌కు ఎంత ఇస్తున్నావు? ఎమ్మెల్యేలకు ఎంత ఇస్తున్నావు? బాగా తిని బలుచు సురేంద్రా అని నిన్ను మేపుతున్నారు. 2029 ఎన్నికల్లో వారలు కోసి ఉడికించి కార్యకర్తలకు పంచుతాం. రాప్తాడు, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని టీడీపీ కార్యకర్తలకు మీరు బ్రాంది షాపులు డబ్బులు ఇవ్వకపోతే మేమే న్యాయం చేస్తాం. అర్థమైందా రాజా.

లోకేష్...నువ్వు తప్పుడువారితో సావాసాలు చేస్తున్నావు. మీ నాయన కాలంలో ధర్మవరం, పెనుకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లోని మండలాలు నియోజకవర్గంగా ఉన్న సమయంలో వంద మందిని హత్యలు చేశారు. మీనాయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చాలా కేసులు విచారణకు వచ్చాయి. ఏ ఒక్క కేసుకూ శిక్ష పడలేదు. ఆ క్రెడిట్, పాపం అంతా మీనాయనదే. ఇప్పుడు నీ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. మా నియోజకవర్గంలో మూడు హత్యలు, గ్యాంగ్‌రేప్, దోపిడీలు జరుగుతున్నాయి. నువ్విచ్చిన ధైర్యంతో కాకపోతే తగరకుంట కొండారెడ్డి హత్యలో బాధితుల ఇళ్లకు ముద్దాయిలు వెళ్లి మాకు అనుకూలంగా సాక్షం చెప్పాలంటూ బెదిరిస్తారా?. అంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది ఆ నా కొడుకులకు. నీకిచ్చిన అధికారం ఎవరికోసం ఉపయోగిస్తున్నావు లోకేషా.

మా మహానటి మా పార్టీలో ప్రముఖుడైన కొడాలి నానికి సాష్టాంగ నమస్కారం చేసి తనకు టుప్లస్‌టు, తన ఉత్తుత్తి కుమారుడికి వన్‌ప్లస్‌వన్ గనెమెన్లను తెచ్చుకుంది. మైనింగ్ శాఖ కూడా ఆమె ఏది అడిగితే అది చేసింది. ఆమె సివిల్ సప్లయ్ కాంట్రాక్టులు కొనసాగాయి. మరి ఈ మర్మం ఏమిటి లోకేషా. పని జరుపుకునేందుకు నువ్వే ఆమెను పంపావా?.

ఆమె వద్ద ఓఎస్డీగా పని చేసిన ఓ అధికారి ఈ మధ్య మాట్లాడుతున్నాడంట. ఓ సీనియర్ నాయకుడు మా పార్టీలోకి వచ్చాడు. ఆ నాయకుడితో ఆ అధికారి చెప్పిందేమిటంటే ఇప్పుడు ఎన్నికలు జరిగితే కూడా జగన్ నూటా యాభై సీట్లతో గెలుస్తాడని పరిటాల సునీతమ్మ చెప్పిందట. ఇదే విషయాన్ని సదరు నాయకుడు మా బాస్‌కు చెప్పాడు. ఇలాంటి ప్రేమ లేఖలు మా బాస్‌కు వస్తున్నాయంట. నాకు తెలిసింది మాత్రం ఈ ఒక్క లేఖేనప్పా. తెలీకుండా ఎన్ని లేఖలు వచ్చాయో నువ్వే చూసుకో లోకేషా. 2029లో ఎక్కడుంటారో ఏమో తెలియదు కాస్తా జాగ్రత్తపడు అంటూ మీడియా కు తెలిపారు

# రాయలసీమ ఇక కరవు ప్రాంతం కాదు.. ఇండస్ట్రియల్ హబ్
## గంగంపల్లి గ్రామస్థులకు ఇళ్ల పట్టాల పంపిణీ

రాప్తాడు, జూలై 4 (అనంత ప్రభ)
రాప్తాడు కూటమి యమ్. యల్. ఏ. పరిటాలా సునీత ఆధ్వర్యంలో ఈరోజు రాయలసీమ అన్నది ఇక కరవు ప్రాంతం కాదని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పారిశ్రామిక హబ్ గా మారుతోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం నసనకోట పంచాయతీలోని గంగంపల్లి గ్రామస్థులకు ఆమె ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వెంకటాపురంలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గంగంపల్లి గ్రామస్థులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. మొత్తం 40మంది బిసి, మైనారిటీ కుటుంబాల వారికి ఒక్కొక్కరికి 3సెంట్ల ప్రకారం ఇంటి స్థలాల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో చాలా చోట్ల స్థలాల సేకరణ జరిగిందన్నారు. అయితే ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో అవన్నీ నిలిచిపోయాయన్నారు. ఐదేళ్లలో కబుర్లు చెప్పారు తప్ప.. ఎక్కడ ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇచ్చింది కానీ, ఇళ్లు నిర్మించింది కానీ లేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. చాలా చోట్ల ఈ ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టినట్టు తెలిపారు. ప్రస్తుతం గంగంపల్లి గ్రామంలో 40కుటుంబాల వారికి పట్టాలు ఇచ్చామన్నారు. అలాగే సుమారు 4లక్షల రూపాయల వ్యయంతో ఆర్డిటి సంస్థ వారు నూతన గృహాలను నిర్మించేందుకు ముందుకొచ్చారన్నారు. వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చినప్పటికీ కొందరు గృహాలు నిర్మించుకోలేదన్నారు. అలాంటి వారికి పట్టాలు రద్దయ్యే అవకాశం ఉందని.. వారు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు...

రాయలసీమ రూపురేఖలు మారుతున్నాయి

అత్యంత వెనుకబడిన రాయలసీమ రూపురేఖలు మార్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మించనున్న రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించడంపై ఆమె తన ఆనందాన్ని పంచుకున్నారు. రాయలసీమలో పంటలు సరిగా పండక, బీడు భూములు కనిపించేవన్నారు. హంద్రీనీవా రాకతో కొంత వరకు



పరిస్థితులు మారాయన్నారు. కానీ కొన్ని ప్రాంతాల్లో ఇంకా కరవు ఛాయలు ఉన్నాయన్నారు. ఇలాంటి సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా చొరవ తీసుకుని రాయలసీమలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమల్లో మూడోవంతు రాయలసీమ ప్రాంతాలకే తరలి వస్తున్నాయంటే సీమపై ముఖ్యమంత్రికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. రెండేళ్లలో రాయలసీమకు రూ.4.58 లక్షల కోట్ల పెట్టుబడులు 2.76 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టారన్నారు. రాయలసీమ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష ఉక్కు పరిశ్రమకు జే.ఎస్.డబ్ల్యూ సంస్థ పూర్తి గ్రీన్ ఎనర్జీతో మొదటి దశలోనే రూ.4500 కోట్ల పెట్టుబడితో నిర్మాణం జరుపుతోందని.. 2028 నాటికి పూర్తై రాయలసీమ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ముందుకు వెళ్తుందన్నారు. ఐదేళ్లలో రెండుసార్లు కడప ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేసిన జగన్.. కనీసం ప్రహరీ గోడ కూడా నిర్మించకుండా.. నేడు అంతా తన గొప్పేనని చెప్పుకుంటున్నారన్నారు. కేవలం పరిశ్రమలకే కాకుండా వ్యవసాయానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. లక్ష కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా మారుస్తున్నారన్నారు. డ్రిప్ ఇరిగేషన్లో రాయలసీమను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. అలాగే సాగునీటి ప్రాజెక్టులను కూడా వేగవంతం చేశారన్నారు. ఈ ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని ఎమ్మెల్యే సునీత అన్నారు..

# జనతా వారధిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, జూలై 4 (అనంత ప్రభ)
ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన జనతా వారధి కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలకు -- ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి ప్రతి సమస్యకు సత్వర పరిష్కారం చూపాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ధర్మవరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, వార్డులు, పట్టణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రతి వినతిని ఓర్పుతో విని, సమస్యల స్వరూపాన్ని సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి అర్జీపై ప్రత్యేకంగా పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, తాగునీటి సమస్యలు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాల అమలు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య సేవలు తదితర అంశాలకు సంబంధించిన వినతులను మంత్రి స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలకు



అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా ప్రతి ఒక్కరి సమస్య తన సమస్యగానే భావిస్తానని పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు జనతా వారధి కార్యక్రమం ఒక సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజాకేంద్రీకృత పాలనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తూనే ప్రజా సమస్యల పరిష్కారాన్ని కూడా వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా మరింత బాధ్యతతో పనిచేస్తూ ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, పట్టణ అధ్యక్షులు జింక చంద్ర, కొంక నాగార్జున, శ్యామ్ రావు, ప్రకాష్ నాయుడు, చంద్రమౌళి, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అర్జీదారులు పాల్గొన్నారు

# సంపద పెరిగింది ప్రశాంతత తగ్గింది

యాడికి, జూలై 4 (అనంత ప్రభ)
నేటి సమాజంలో డబ్బు సరిపోవడం లేదు అనే మాట ప్రతి వర్గం నోట వినిపిస్తోంది. కూలి పని చేసే వ్యక్తి నుంచి కోట్లు సంపాదించే వ్యాపారవేత్త వరకు అందరూ ఇదే భావన వ్యక్తం చేస్తున్నారు. అయితే సమస్య నిజంగా ఆదాయంలో ఉందా లేక మనిషి ఆలోచనా విధానంలో ఉందా అనే ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకప్పుడు కుటుంబ అవసరాలు పరిమితంగా ఉండేవి. వచ్చిన ఆదాయానికి తగ్గట్టుగా జీవనం సాగించేవారు. కానీ కాలం మారడంతో పాటు అవసరాలు, ఆశలు, అంచనాలు కూడా విపరీతంగా పెరిగాయి. ఫలితంగా ఆదాయం ఎంత పెరిగినా అది సరిపోవడం లేదనే భావన ఎక్కువ మందిలో కనిపిస్తోంది. మనిషి శరీరం ప్రస్తుతం ఉన్న జీవితాన్ని అనుభవిస్తున్నా, అతని మనసు మాత్రం ఎప్పుడూ రేపటి గురించే ఆలోచిస్తోంది. వంద రూపాయలు ఉన్నవాడు రెండువందల రూపాయల అవసరాలను ఊహిస్తుంటే, లక్ష రూపాయలు సంపాదించే వ్యక్తి రెండు లక్షల ఖర్చుల గురించి ప్రణాళికలు వేస్తున్నాడు. ఆదాయం పెరిగిన కొద్దీ కోరికలు కూడా అదే వేగంతో పెరుగుతుండటమే అసంతృప్తికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం అవసరాలు, ఆశల మధ్య ఉన్న తేడాను గుర్తించకపోవడం వల్లే చాలామంది ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారు. ఆహారం, విద్య, ఆరోగ్యం, నివాసం వంటి అంశాలు అవసరాలైతే, ఇతరులతో పోల్చుకుని మరింత సౌకర్యాలు కోరుకోవడం ఆశగా మారుతోంది. ఒక ఇల్లు ఉంటే పెద్ద ఇల్లు, ఒక వాహనం ఉంటే మరింత ఖరీదైన వాహనం కావాలనే ఆలోచన పెరుగుతోంది. ఇక సామాజిక మాధ్యమాల ప్రభావంతో పోలికల సంస్కృతి మరింత పెరిగింది. ఇతరుల విజయాలు, సంపద, జీవనశైలిని చూసి తమ జీవితాన్ని తక్కువగా అంచనా వేసే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ఉన్నదానిపై సంతృప్తి తగ్గి, లేని దానిపైనే దృష్టి కేంద్రీకృతమవుతోంది. ఆర్థికంగా ఎదిగిన కొద్దీ బాధ్యతలు, భవిష్యత్తుపై ఆందోళనలు కూడా పెరుగుతున్నాయి. ఇంకా ఎలా సంపాదించాలి, రేపటి పరిస్థితి ఎలా ఉంటుంది అనే ప్రశ్నలు మనిషిని నిరంతరం పరుగులు పెట్టిస్తున్నాయి. ఫలితంగా డబ్బు పెరిగినా మానసిక ప్రశాంతత తగ్గిపోతోందని పరిశీలకులు చెబుతున్నారు. సంపద అంటే కేవలం డబ్బు మాత్రమే కాదని, కుటుంబ ఆనందం, ఆరోగ్యం, మనశ్శాంతి కూడా అంతే ముఖ్యమని పెద్దలు సూచిస్తున్నారు. వచ్చిన ఆదాయంతో బాధ్యతలను నిర్వర్తిస్తూ, ఉన్నదానితో సంతృప్తి చెందగలిగితేనే నిజమైన ఆనందం లభిస్తుందని పేర్కొంటున్నారు మొత్తంగా చూస్తే డబ్బు సరిపోవడం లేదనే భావనకు కారణం ఆదాయం కొరత మాత్రమే కాదు. మనసు ఎప్పుడూ ప్రస్తుతం ఉన్న స్థితి కంటే ముందుకు పరిగెత్తడమే. సంపాదన కంటే ఆశలు వేగంగా పెరుగుతున్న ఈ కాలంలో సంతృప్తే నిజమైన సంపద అని నిపుణులు సూచిస్తున్నారు

# ప్రణాళికాబద్ధమైన జనాభా పై అవగాహన పెంచాలి...

అనంతపురం, జూలై 4 (అనంత ప్రభ)
అనంతపురం ఈరోజు జిల్లా అధికారుల సమన్వయ కమిటీ భేటీలో అభిప్రాయం..... కాన్పు కాన్పు కు తగిన ఎడమ సూచించడం, తల్లి బిడ్డల ఆరోగ్యం పెంచడం, టీనేజ్ గర్భాలను నిరోధించేందుకు అవగాహన పెంచడం లాంటి అంశాలతో ఈసారి ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించుకోవాలని జిల్లా సమన్వయ కమిటీ అభిప్రాయబడింది. ఈనెల 11న జరగనున్న ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా చేపట్టవలసిన కార్యక్రమాలపై శనివారం జిల్లా అధికారుల సమన్వయ కమిటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఈ బి దేవి అధ్యక్షతన జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో జరిగింది. ఈసారి ప్రజల్లో అవగాహన పెంచేందుకు కోసం ఎనిమిది రోజులపాటు అవగాహన సభలు సమావేశాలు అవగాహన ర్యాలీలు సదస్సులు నిర్వహించాలని ఉత్తమ దంపతులకు నగదు బహుమతులు ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. ప్రధానంగా వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, పంచాయతీరాజ్, మహిళా సంఘాలు,




స్వచ్ఛంద సంస్థలు ప్రపంచ జనాభా దినోత్సవం ప్రచార కార్యక్రమంలో పాల్గొనాలని కమిటీ నిర్ణయించింది. ఈనెల11వ తేదీ నుండి 18వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాలు ప్రతిరోజు ఒక్కో శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని నిర్ణయించారు. గ్రామస్థాయిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఆశ, అంగన్వాడి, ఏఎన్ఎం, స్వయం సహాయక సంఘాలు, పూర్తిస్థాయిలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులతో పాటు పంచాయతీరాజ్, ఐసిడిఎస్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు

## ఓటరు జాబితా సవరణను వేగవంతం చేయాలి



యాడికి, జూలై 4 (అనంత ప్రభ)

యాడికి మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బీఎల్ఏలతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై టీడీపీ నాయకులు బీఎల్ఏలకు దిశానిర్దేశం చేశారు. టిడిపి సీనియర్ నాయకుడు గొర్తి రుద్రమ నాయుడు, టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగవంతంగా చేపట్టి అర్హులైన కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడంతో పాటు, మరణించిన వారి పేర్లను తొలగించే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో క్లస్టర్ 4 ఇన్‌చార్జి మాయకుంట నారాయణస్వామి, బీఎల్ఏలు నరసింహ చౌదరి, దయ్యాలమడుగు సుబ్బారెడ్డి, హాజీపీర్, రామచంద్రరాజు, నారాయణరెడ్డి, ఆదినారాయణ, వంకంరాజు, దివి చంద్ర, ఖాదర్ వలీ తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి
## పాఠశాలల్లో బోధన దెబ్బతింటోందని పిడిఎస్ఓ ఆందోళన



ఆదోని, జూలై 4 (అనంత ప్రభ)

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని పిడిఎస్ఓ రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పిడిఎస్ఓ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. కొన్ని పాఠశాలల్లో 300 మందికిపైగా విద్యార్థులు ఉన్నప్పటికీ ఒక్క ఉపాధ్యాయుడే విధులు నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొనడంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని, దీనివల్ల విద్యార్థుల విద్యాభ్యాసం తీవ్రంగా దెబ్బతింటోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాల లోపాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వ విద్యపై దుష్ప్రచారం జరుగుతోందని, దీంతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పెరిగి తల్లిదండ్రులపై భారీ ఫీజుల భారం పడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతో పాటు పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్లీ, గణేష్, మల్లికార్జున, రాము తదితరులు పాల్గొన్నారు

## జనసేన పదవుల దరఖాస్తులకు మరో అవకాశం..
## జూలై 5 వరకు గడువు పొడిగింపు: వాల్మీకి లక్ష్మన్న



మంత్రాలయం, జూలై 4 (అనంత ప్రభ)

జనసేన పార్టీలో వివిధ పదవుల కోసం దరఖాస్తు చేసుకునే గడువును జూలై 5 వరకు పొడిగించినట్లు మంత్రాలయం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ వాల్మీకి లక్ష్మన్న తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన జనసేన పార్టీ సభ్యత్వం కలిగిన నాయకులు, కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీ కోసం సేవ చేయాలనే ఆసక్తి ఉన్న వారు కర్నూలులోని మౌర్య ఇన్ నాలుగో అంతస్తులోని ఫంక్షన్ హాల్‌లో ఈరోజు, రేపు తమ దరఖాస్తులను సమర్పించవచ్చన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలనే సంకల్పం ఉన్న నాయకులు, కార్యకర్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తులు అందజేయాలని పిలుపునిచ్చారు. పదవుల ఎంపిక ప్రక్రియలో అర్హులైన వారికి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

## శ్రీ బుదిగుమ్మ సంజీవరాయస్వామికి విశేష పూజ కార్యక్రమాలు



బెలుగుప్ప, జులై 4 (అనంత ప్రభ)

బెలుగుప్ప మండలం రామసాగరం బూడిగుమ్మ శ్రీ ఆంజనేయస్వామి కి శనివారం రోజున ఆలయ పూజారి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పాలాభిషేకం, పంచామృత అభిషేకం, అలంకరణ,ఆకుపూజ ,అర్చన, సింధూర కుంకుమార్చన ,మహానైవేద్యం , మహామంగళహారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలు అభిషేకాల యందు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆలయం నందు పెద్ద ఎత్తున అన్న ప్రసాద కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి బి బాబు మరియు ఆలయ కమిటీ తెలిపారు

## జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయండి, జిల్లా జడ్జ్ ఈ భీమారావు




అనంత, జులై 4 (అనంత ప్రభ)

ఉమ్మడి అనంతపురం సత్యసాయి జిల్లాల న్యాయాధికారులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ భీమారావు ఆధ్వర్యంలో అదనపు జిల్లా జడ్జి సత్య శ్రీ మరియు అదనపు జిల్లా జడ్జి బాబు నాయక్ లు సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని న్యాయాధికారులతో వర-్చువల్ గా సమీక్ష నిర్వహించి లోకదాలతో తీసుకోవలసినటువంటి చర్యలు గురించి వివరించి తగు సూచనలు చేశారు. జులై 11 వ తారీకు జరిగే లోకదాలత్ విజయవంతం కావాలని ప్రజలకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బారోసో స్టేషన్ అధ్యక్షులతో కూడా వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించి కేసుల పరిష్కారంలో వారి సహకారాన్ని కోరారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల పోలీస్ అధికారులతో కూడా వర్చువల్ గా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి డిస్ట్రిక్ట్ సూపరెంటెంట్ ఆఫ్ పోలీస్ సతీష్ కుమార్ హాజరై తమ పోలీసు అధికారులు లోక్ అదాలత్ విజయవంతం చేయడానికి కృషి చేస్తారని అలాగే వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వాటి పరిష్కారాన్ని కోరారు ఈ సందర్భంగా అనంతపురం కేంద్రంలో పనిచేస్తున్నటువంటి జూనియర్ సివిల్ జడ్జిలు భార్గవి, హారిక మరియు ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ పావని భౌతికంగా హాజరై వారు తీసుకుంటున్న చర్యల్ని అదనపు జిల్లా జడ్జిలకి వివరించారు

## రాయితీపై కంది విత్తనాల పంపిణీ



యాడికి, జూలై 4 (అనంత ప్రభ)

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు స్వల్పకాలిక పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా సూచించారు. యాడికి మండలంలోని రాయలచెరువు రైతు సేవా కేంద్రంలో శనివారం ఆత్మనిర్భర్ పథకం కింద ఎల్ఆర్‌జీ 105, ఎల్ఆర్‌జీ 133, 33 రకాల కంది విత్తనాలను రైతులకు రాయితీపై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను వినియోగించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు. మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాయితీపై అందిస్తున్న నాణ్యమైన కంది విత్తనాలను వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా లాభపడాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయలచెరువు పంచాయతీ అభివృద్ధి అధికారి సాయి అరుణ్ కుమార్, వేములపాడు సహకార సంఘం అధ్యక్షుడు నాగమునిరెడ్డి, గ్రామ వ్యవసాయ అధికారి పవన్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ పారిశ్రామికాభివృద్ధికి ఉక్కు పరిశ్రమే బలమైన పునాది: గడ్డా ఫక్రుద్దీన్



ఆదోని, జూలై 4 (అనంత ప్రభ)

రాయలసీమ అభివృద్ధి దిశగా జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కీలక అడుగుగా నిలుస్తుందని టీడీపీ ఏపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి గడ్డా ఫక్రుద్దీన్ అన్నారు. శనివారం ఆదోనిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపరాళ్లపల్లిలో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ హెవీ సెక్షన్ మిల్ కాంక్రీట్ ఫ్లోరింగ్ పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించడం రాయలసీమ పారిశ్రామిక చరిత్రలో మరో మైలురాయిగా అభివర్ణించారు. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ఆధ్వర్యంలో రూ.16,350 కోట్లతో ఉక్కు పరిశ్రమ, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ ద్వారా రూ.20,350 కోట్లతో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు కానుండడం ప్రాంత అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల స-ుమారు 2,700 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, స్థానిక యువతకు ఉపాధి, పరిశ్రమల విస్తరణకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాయలసీమకు పెద్ద పరిశ్రమలు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షిస్తూ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాయలసీమ వేగంగా పారిశ్రామిక ప్రగతి సాధిస్తోందని అన్నారు. ఈ ప్రాజెక్టులు ప్రాంత ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపునిస్తాయని ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సజ్జన్ జిందాల్, శ్రీనివాస వర్మ, గొట్టిపాటి రవికుమార్, ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## బుక్కరాయసముద్రంలో జూలై 7, 8న అనంత క్రీడా ఛాంపియన్‌షిప్



అనంతపురం, జూలై 4 (అనంత ప్రభ)

బుక్కరాయసముద్ర మండల స్థాయి అనంత క్రీడా ఛాంపియన్‌షిప్--2026 పోటీల నిర్వహణకు జూలై 7, 8 తేదీలను ఖరారు చేశారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయం తీసుకున్నారు. జూలై 7న బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అండర్--14 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనుండగా, జూలై 8న అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని నిర్వాహకులు కోరారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, ఆరోగ్యవంతమైన పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అవ-సరమైన ఏర్పాట్లపై సమావేశంలో విస్తృతంగా చర్చించి సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో ఎంపీపీ సునీత, ఎంపీడీవో సాల్మన్, ఎంఈఓ--1 నవీద, ఎంఈఓ--2 లింగనాయక్, ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, మండల కోఆర్డినేటర్ నాగరాజు, పీడీ రాజశేఖర్ రెడ్డి, వెంకటరమణ, వరలక్ష్మి, లలిత, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల అభివృద్ధికి విద్యే ప్రధాన ఆయుధం: మాదాస్ జగన్నాథ్




ఆదోని, జూలై 4 (అనంత ప్రభ)

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదోని మండలం బసాపురం గ్రామంలో శనివారం "గో టు విలేజ్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, కర్నూలు జిల్లా ఇన్‌చార్జిలు దమ్ము చిన్న వెంకటేశ్వర్లు మాదిగ, పులిగొట్ల గోపి మాదిగ సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ టౌన్ ఇన్‌చార్జి మాదాస్ జగన్నాథ్ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ ఫలాలు నిజంగా మాదిగలకు అందాలంటే విద్యే ప్రధాన ఆయుధమని అన్నారు. మాదిగ పల్లెల్లో ప్రతి చిన్నారిని ఐదు సంవత్సరాలు నిండిన వెంటనే పా-ఠశాలలో చేర్పించాలని పిలుపునిచ్చారు. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు పాలిటెక్నిక్, అగ్రికల్చర్, హార్టికల్చర్ వంటి డిప్లొమా కోర్సుల్లో చేరి తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ వంటి గ్రూపులను ఎంపిక చేసుకుని ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని అన్నారు. విద్యార్థులు ఇంటర్మీడియట్‌తోనే చదువును ఆపకుండా డిగ్రీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ వరకు చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని ప్రోత్సహించారు. వివిధ ప్రవేశ పరీక్షలకు కష్టపడి సిద్ధమై తమ ప్రతిభను చాటాలని యువతకు సూచించారు. అలాగే జూలై 7న ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మను ఏర్పాటు చేసి జెండాను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్. నరసింహ, మొగతాళి విజయరాజు, ప్రహ్లాద్, ప్రకాష్, ఉరుకుందు తదితరులు, బసాపురం గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం



శింగనమల, జూలై 4 (అనంత ప్రభ)

శింగనమల మండలం గుమ్మేపల్లి గ్రామపంచాయతీ 53వ బూతులో శిశీగనమల గౌరవ శాసన సభ్యురాలు బండారు శ్రావణిశ్రీ ఆదేశానుసారం శిశీగనమల నియోజకవర్గం(ఎస్ ఐ ఆర్ ) అబ్జర్వర్ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం బి ఎల్ ఓ లీలావతి బి ఎల్ ఏ మల్లికార్జున వి ఆర్ ఏ నల్లప్ప దేగల హరి తదితరులు పాల్గొన్నారు

## శింగనమల గ్రామంలో వంగవీటి మోహన్‌రంగా 79వ జయంతి వేడుకలు



శింగనమల, జూలై 4 (అనంత ప్రభ)

సింగనమల మండలం సింగనమల గ్రామంలోని రామస్వామి గుడి సమీపంలో ప్రముఖ నాయకుడు వంగవీటి మోహన్‌రంగా 79వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నాగార్జున, నరసింహ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, వంగవీటి మోహన్‌రంగా 1947 జూలై 4న కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కాటూరు గ్రామంలో జన్మించారని తెలిపారు. తన సోదరుడు వంగవీటి రాధాకృష్ణ అడుగుజాడల్లో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆయన, విజయవాడలో జరిగిన రాజకీయ పరిణామాలు మరియు విభేదాల నేపథ్యంలో బలమైన నాయకుడిగా ఎదిగారని పేర్కొన్నారు.

అలాగే 1988 డిసెంబర్ 26న విజయవాడలో జరిగిన దారుణ హత్యలో ఆయన ప్రాణాలు కోల్పోయారని, ఆయన మరణం అనంతరం నగరంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు.

## సాయి కిరణ్ కు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



కూడేరు, జులై 4 (అనంత ప్రభ)

ఉరవకొండ మండలం పెద్దకోకుంట్ల గ్రామంలోనే మంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రోజున జయపురం గ్రామానికి చెందిన బోయ సాయి కిరణ్ కు సీఎం ఆర్ ఎఫ్ చెక్కును మంత్రి చేతుల మీదుగా అందించారు. సాయి కిరణ్ విధి నిర్వహణలో తన సొంత పని చేస్తుండగా మధ్యలో వేలు కట్ కావడంతో స్థానిక తెదేపా నాయకులు అంపగౌని పరందామా విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన మంత్రి పయ్యావుల కేశవ్ సాయి కిరణ్ కు 17 వేల రూపాయలు సీఎం సహాయ నిధి చెక్కును అందించారు. దాంతో సాయి కిరణ్ మంత్రి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశ-ారు. అలాగే స్థానిక తెదేపా నాయకులు మాజీ డీలర్ అంపగౌని పరంధామా బాధితుని తరపున సీఎం సహాయ నిధి వర్తింపు కు కృషిచేసిన మాజీ డీలరు కేజీబీవీ స్కూల్ కమిటీ చైర్మన్ అంపగౌని పరంధామ, గడిపూటి వీరాంజనే-యులు కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు

## భక్తి చాటిన పాదయాత్ర.. 10 గంటల్లో 60 కి.మీ. ప్రయాణం



ఆదోని, జూలై 4 (అనంత ప్రభ)


కురుబల ఆరాధ్య దైవం బీరలింగేశ్వర దేవర బండార మహోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా ఆస్పరి మండలం పెద్దహుల్తి గ్రామంలో నిర్వహించిన శ్రీ ఉల్తి కార్మంచి బండార మహోత్సవానికి ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామానికి చెందిన శ్రీ గర్జలింగేశ్వర స్వామి, దేవరాలు అయ్యమ్మ దేవి పట్టాదేవుళ్లు సుమారు 800 మంది భక్తులతో కలిసి పాదయాత్రగా చేరుకున్నారు. దాదాపు 60 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 10 గంటల్లో పూర్తి చేసి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. రాష్ట్రంలోని 21 పట్టాల కురుబ ఆరాధ్య దేవుళ్లు ఒకేచోట చేరి ప్రత్యేక పూజలు నిర్వహించడం విశేషంగా నిలిచింది. చిన్నపిల్లల నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్నవారి వరకు కులమత భేదాలు లేకుండా భక్తులు పాదయాత్రలో పాల్గొన్నారు. భక్తితో ఏదైనా సాధించవచ్చని తమ సంకల్పంతో నిరూపించారు. మార్గమధ్యంలోని గ్రామాల ప్రజలు దేవుళ్లకు, భక్తులకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. పాదయాత్రలో పాల్గొన్న భక్తులకు మధ్యలో భోజనం, తాగునీటి ఏర్పాట్లు చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కురుబ--కురుమ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప మాట్లాడుతూ ధర్మం, భక్తి అందరికీ సమానమని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తా-యని అన్నారు

## జగనన్న బాటలో రాయలసీమ జలాల కోసం పోరాటం

మడకశిర, జూలై 4 (అనంత ప్రభ)

మన ప్రియతమ నేత, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, రాయలసీమ జలవనరుల సాధనలో భాగంగా "రాయలసీమ ఎత్తిపోతల పథకం – గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ" శ్రీ సత్యసాయి జిల్లా కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు హలుకూరు కాంతరాజు గారికి శంకరగల్లు గ్రామంలో వైఎసా-స్రర్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం చేతన్ గారి ఆధ్వర్యంలో ఎంతో క్రమశిక్షణతో, అద్భుతంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఎస్ ఎల్ ఈరలకప్ప గారు హాజరై, కాంతరాజు గారిని శాలువా కప్పి సత్కరించారు. ప్రతిపక్షంలో ఉన్నా, రాయలసీమ ప్రాజెక్టుల పూర్తి కోసం వైఎస్సార్‌సీపీ అలుపెరగని పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.



సేవా నిరతి:

పదవి వచ్చిన సంతోషంలోనూ, సమాజానికి మేలు చేయాలనే గొప్ప ఉద్దేశంతో శ్రీ శ్రీ శ్రీ సద్గురు గుడికల్లు అలిపిరి స్వాములవారి ఆశ్రమానికి హలుకూరు కాంతరాజు అన్న గారు తన వంతు ఆర్థిక విరాళాన్ని అందజేశారు. ఆయన సేవా గుణాన్ని పలువురు నాయకులు ప్రశంసించారు.

మహిళా భాగస్వామ్యం:

ఈ సన్మాన కార్యక్రమానికి శంకరగల్లు మరియు చుట్టుపక్కల ప్రాంతాల నుండి మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి, కాంతరాజు అన్నకు హారతులు పట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

పాల్గొన్న నాయకులు:

ఈ కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలకప్ప గారు, అమరాపురం మండల అధ్యక్షులు త్రిలోకనాథ్ గారు, యువజన విభాగం అధ్యక్షులు మల్లి గారు, వాలంటీర్ ప్రసిడెంట్ లక్ష్మీ నరసప్ప గారు, హరీష్ (పంచాయతీ ప్రసిడెంట్), నాగేంద్ర పుష్పలత , నాగేంద్రప్ప (హలుకూరు కన్వీనర్), డీలర్ నాగన్న గారు, మరియు నరసింహమూర్తి, ఎస్ ఇ తిప్పయ్య, లక్ష్మీకాంత్, రంగస్వామి, ప్రహ్లాద, విజయకుమార్, నాగరాజు, సిద్దార్థ్, చిట్నడుకు రాజేష్, మనోహర్, రమేష్ గారు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా చేపట్టిన చేతన్ గారికి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కాంతరాజు గారు మాట్లాడుతూ.. అధినేత జగనన్నకు, తనకు సహకరించిన నాయకులకు, శ్రేణులకు మరియు ఆత్మీయంగా సన్మానించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు

## నేడు పలు గ్రామాలలో ఎస్ ఐ ఆర్ అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఈరలక్కప్ప

గుడిబండ, జూలై 4 (అనంత ప్రభ)

గుడిబండ మండల కేంద్రంలోని శంకరగల్లు, రాళ్లపల్లి గ్రామాలలో వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎస్ ఐ ఆర్ అవగాహన కార్యక్రమం నిర్వహించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్ ఎల్ ఈరలక్కప్ప గారు..

ఈ సందర్భంగా ఈరలక్కప్ప గారు ప్రజలకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ చు-రుకుగా పాల్గొని తమ వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హులైన ఓటరు తమ హక్కును పరిరక్షించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈరలక్కప్ప గారు



పేర్కొన్నారు...

ఈ కార్యక్రమంలో తాలూకా బూత్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున గౌడ్, మండల బూత్ కమిటీ అధ్యక్షులు యంజారప్ప, బి ఎల్ ఓ లు, హనుమంతరాయప్ప, భాస్కర్ బి ఎల్ ఎ లు, లక్ష్మి నరసప్ప, వీరేష్, హరీష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు









## రాగి పిండితో చేసే ఆరోగ్యకరమైన చాక్లెట్ కేక్



కేక్ అంటే పిల్లలకి ఎంతో ఇష్టం. కానీ బయట దొరికే కేకులు ఎక్కువగా మైదా పిండితోనే తయారు చేస్తారు. దీని వల్ల వారి ఆరోగ్యానికి హానికరం. కాబట్టి ఇంట్లోనే రాగి పిండి, చాక్లెట్ కలిపి చేసే కేకును తయారు చేస్తే వారికి ఆరోగ్యకరం కూడా. దీన్ని తయారు చేయడం చాలా సులువు.

కావలసిన పదార్థాలు

రాగి పిండి – ఒకటిన్నర కప్పు
నీళ్లు – ముప్పావు కప్పు
పెరుగు – అరకప్పు
బేకింగ్ పౌడర్ – ఒక స్పూన్
వెనిల్లా ఎసెన్స్ – ఒక స్పూను
కోకో పౌడర్ – ఒక స్పూన్
వెజిటబుల్ ఆయిల్ – మూడు స్పూన్లు
బటర్ – ఒక స్పూను
బేకింగ్ సోడా – ఒక స్పూను
ఉప్పు – ఒక స్పూను
పంచదార పొడి – మూడు స్పూన్లు

తయారు చేసే విధానం

1. ఈ కేక్ తయారు చేయడానికి ఒక పెద్ద గిన్నెను తీసుకోవాలి. అందులో పెరుగు, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, పంచదార పొడి, ఉప్పు, వెనిల్లా ఎసెన్స్ వేసి బాగా కలిపి పది నిమిషాలు పక్కన పెట్టాలి.
2. పది నిమిషాలు తర్వాత ఆ మిశ్రమంలో రాగి పిండి, కోకో పౌడర్, వెజిటబుల్ నూనె వేసి మందంగా వచ్చేలా కలపాలి. 3. మరీ మందంగా అనిపిస్తే కొద్దిగా నీరు వేసి పిండిని రెడీ చేసుకోవాలి. ఉండలు లేకుండా బాగా కలుపుకోవాలి.
4. కేకు మౌల్డ్ తీసుకొని దాని అడుగు భాగానికి బటర్ రాయాలి. తరువాత పార్చ్‌మెంట్ పేపర్ వేయాలి.
5. ఇప్పుడు రెడీ చేసిన కేకు పిండిని ఆ మౌల్డ్‌లోకి వేసి గాలి బుడగలు లేకుండా నేలకి మెల్లగా కొట్టాలి.
6. ముందుగానే ఓవెన్‌ను 180 డిగ్రీల సెల్సియస్ వద్దకు ప్రీ హీట్ చేసుకోవాలి. ప్రీ హీట్ చేసిన ఆ ఓవెన్లో అరగంట పాటు కేక్ మౌల్డ్‌ని ఉంచాలి. ః
7. ఆ తరువాత టూత్ పిక్‌తో గుచ్చి చూడాలి. టూత్ పిక్‌కు ఏమీ అతుక్కోకుండా వస్తే కేక్ రెడీ అయినట్టే.

## మెరిసే చర్మం కావాలంటే.. ఈ 7 జాగ్రత్తలు తప్పనిసరి


అందమైన, మెరిసే చర్మం కావాలని ప్రతి ఒక్క అమ్మాయి కోరుకుంటూ ఉంటుంది. స్పాట్ లెస్ బ్యూటీ సొంతం చేసుకోవడానికి.. మార్కెట్లో దొరికే రకరకాల క్రీమ్‌లు, ఫేస్ ప్యాక్స్ ట్రై చేస్తూ ఉంటారు. కొంతమంది ఆ క్రీమ్‌లు, ఫేస్ ప్యాక్‌లు వాళ్ల చర్మతత్వానికి సరిపోతాయో? లేదో అన్న విషయం గురించి కూడా ఆలోచించరు. ఇలా ఏదిపడితే అది, బ్యూటీ కేర్‌లో యూడ్ చేసుకుంటే.. చర్మ సమస్యలు అధికమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. మీరు మీ చర్మాన్ని అందంగా, ఆరోగ్యంగా ఉంచుకోవడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అవేంటో తెలుసుకోవాలంటే.. ఈ స్టోరీ చదివేయండి.

### సన్ స్క్రీన్ మర్చిపోవద్దు..

మీ చర్మాన్ని యూవీ కిరణాల నుంచి రక్షించడానికి.. రోజూ బయటకు వెళ్లే ముందు సన్‌స్క్రీన్ అప్లై చేసుకోవడం తప్పనిసరి. సన్‌స్క్రీన్ మీ చర్మాన్ని తేమగా ఉంచుతంది. మిమ్మల్ని య-ంవ్వనంగా, వృద్ధాప్య ఛాయలు తర్వగా రాకుండా చేస్తుంది. సన్ స్క్రీన్ చర్మ క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడతుందని నిపుణులు చెబుతున్నారు. మీ చర్మతత్వానికి అనుగుణంగా ఎంత ఎస్‌పీఎఫ్ ఉన్న లోషన్ ఉపయోగించాలో సౌందర్య నిపుణులను అడిగి తెలుసుకోండి. ఒకవేళ సూర్యరశ్మిలో ఎక్కువ సమయం గడపాల్సి వస్తే తప్పనిసరిగా ప్రతి రెండు గంటలకోసారి సన్‌స్క్రీన్ రాసుకుంటూ ఉండాలని నిపుణులు అంటున్నారు.

### మీ చర్మ తత్వం తెలుసుకోండి..

ముందుగా మీ చర్మ తత్వాన్ని తెలుసుకోండి. మీ స్కిన్ టైప్‌ను



తెలుసుకుని.. చర్మ సంరక్షణ ఉత్పత్తులను వాడాలని నిపుణులు సూచిస్తున్నారు. మీ చర్మతత్వం బట్టి, ఉత్పత్తులు వాడకపోతే.. చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

### స్క్రబింగ్..

స్క్రబింగ్ వల్ల చర్మంపై పేరుకున్న మురికి, డెడ్ సెల్స్, టాక్సిన్స్ తొలగుతాయి. స్క్రబ్ ద్వారా చర్మంపై పేరుకొన్న మృతకణాలతో పాటు, దుమ్ము, ధూళి కూడా సులభంగా తొలగిపోతాయి. స్క్రబ్ వల్ల రక్తప్రసరణ సక్రమంగా జరిగి చర్మగ్రంథులు తెరుచుకుని శుభ్రపడతాయి. అందుకే వారానికి రెండు మూడు సార్లు స్క్రబ్ చేసుకుంటే.. చర్మం తాజా మార-ుతుంది. మొటిమలు ఎక్కువగా ఉంటే.. స్క్రబ్ చేయవద్దు.

### క్లెన్సింగ్..

నిద్ర లేవగానే, నిద్రపోయే ముందు ముఖం శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోండి. నిద్రపోయేటప్పుడు మన ముఖంపై పేరుకునే బ్యాక్టీరియాను తొలగించాలంటే ముఖాన్ని బాగా కడుక్కోవాలి. ముఖ్యంగా నిద్రపోయే ముందు మేకప్‌ని పూర్తిగా తొలగించి శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యం.

### సున్నితంగా.. హ్యాండిల్ చేయండి..

కొంతమంది ముఖం శుభ్రం చేసుకునేప్పుడు, స్క్రబ్ చేసేప్పుడు, క్లెన్సింగ్ చేసేప్పుడు... రఫ్‌గా హ్యాండిల్ చేస్తూ ఉంటారు. గోళ్లతో గీరుకోవడం, ముఖాన్ని గట్టిగా రుద్దుకోవడం వల్ల.. చర్మ కణాలు దెబ్బతింటాయి. ఇలా చేయడం వల్ల మీ అందం దెబ్బ తింటుంది. మీ చర్మాన్ని సున్నితంగా ట్రీట్ చేయాలి. గోరువెచ్చని నీటితో మీ ముఖాన్ని బాగా శుభ్రం చేసుకోవాలి. అప్పుడు తేలికపాటి క్లెన్సర్‌ను ఉపయోగించవచ్చు. క్లెన్సర్‌ని ముఖంపై అప్లై చేసి, వృత్తాకార కదలికలో సున్నితంగా రుద్దండి.

## మామిడిపండుతో మిల్క్‌షేక్.. వెరీ



పాలు ఆరోగ్యానికి చాలా మంచిది. ఏకాలమైనా వీటిని తీసుకోవాల్సిందే. అయితే, ఎండాకాలంలో పాలని వేడిగా తీసుకునే బదులు చల్లగా తాగితే బావుంటుంది కదా. అందుకే బెస్ట్ సమ్మర్ స్పెషల్ 5 మిల్క్ షేక్స్ చూడండి. వీటిని మీ డైట్‌లో చేర్చుకోండి.

డేట్ వాల్‌నట్ మిల్క్ షేక్

కావాల్సిన పదార్థాలు..

6 ఖర్జూరాలు 1 టేబుల్ స్పూన్ ఎండు ద్రాక్ష, 5 వాల్‌నట్స్ 1 కప్పు చల్లని పాలు.
తయారీ విధానం.. గిన్నెలో ఖర్జూరం, వాల్‌నట్స్, ఎండుద్రాక్ష వేయాలి. అరకప్పు వేడి నీటిని పోసి వాటిని 15 నిమిషాల పాటు నానబెట్టండి. నీటిని తీసి డేట్స్, వాల్‌నట్స్, ఎండుద్రాక్షలు వేసి బ్లెండ్ చేయండి. 1 కప్పు చల్లని పాలని బ్లెండర్ పోసి బాగా కలపండి. అంతే డేట్ వాల్‌నట్ మిల్క్ షేక్ రెడీ.

యాపిల్ బనానా మిల్క్ షేక్..
కావాల్సిన పదార్థాలు..

1 చిన్న ఆపిల్, 1 అరటిపండు, అర టీస్పూన్ యాలకుల పొడి, 1 కప్పు పాలు, 1 టేబుల్ స్పూన్ తేనె.

తయారీ విధానం..

యాపిల్, అరటిపండు తొక్కని తీసి ముక్కలుగా కట్ చేసి బ్లెండర్‌లో వేయండి. ఇప్పుడు తేనె, యాలకుల పొడి కూడా వేయాలి. దీనంతటిని మెత్తగా మిల్క్‌షేక్‌లా అయ్యే వరకూ బ్లెండ్ చేసి సర్వ్ చేయడమే.

మ్యాంగో మిల్క్ షేక్..
కావాల్సిన పదార్థాలు..
1 మామిడి పండు 1 కప్పు పాలు, 5 జీడిపప్పులు, 1 టేబుల్ స్పూన్ తేనె, చిటికెడు కుంకుమ పువ్వు,
తయారీ విధానం..

ఇప్పుడు బ్లెండర్‌లో మామిడిపండు, పాలు, జీడిపప్పు, చక్కెర, కుంకుమపువ్వు వేయండి. మెత్తగా షేక్‌ల చేయండి. దీనిని గ్లాసులో పోసి మామిడి పండు ముక్కలతో గార్నిష్ చేయండి.

డ్రై ఫ్రూట్ మిల్క్ షేక్..

డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి చాలా మంచిది. అందుకే, సమ్మర్‌లోనూ వీటిని షేక్స్‌లో వాడొచ్చు. అందుకోసం ఏమేం కావాలంటే..

10 జీడిపప్పులు, 5 బాదంపప్పులు, 5 పిస్తా పప్పులు 1 టీ స్పూన్ నానబెట్టిన ఎండుద్రాక్ష, 1 కప్పు పాలు 2 టీ స్పూన్ చక్కెర మీరు మరింత హెల్దీగా తాగాలనుకుంటే తేనె కూడా తీసుకోవచ్చు. చిటికెడు కుంకుమపువ్వు.
తయారీ విధానం.. ఓ గిన్నెలో జీడిపప్పు, బాదం, పిస్తా వేసి పావు కప్పు పాలు పోసి 10 నిమిషాలు నాననివ్వండి. ఇప్పుడు మిగిలిన పాలతో కలిపి బ్లెండ్ చేయండి. ఇప్పుడు కుంకుమపువ్వు, తేనె కూడా వేసుకి మెత్తగా మిల్క్ షేక్ చేసుకోండి. అంతే టేస్టీ మిల్క్ షేక్ రెడీ అయినట్లే.

# టాలీవుడ్ డైరెక్టర్‌తో డేటింగ్ రూమర్స్? ఆ హీరోతో రిలేషన్‌లో ఉన్నానంటూ హీరోయిన్ ట్విస్ట్!



చిత్ర పరిశ్రమలో బ్యాచిలర్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్న నటీనటులంతా ఒక్కొక్కరిగా మ్యారేజ్ లైఫ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నా. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ఈ ట్రెండ్ కొనసాగుతోంది. ఎప్పటి నుంచో ప్రేమాయణం సాగిస్తున్న అమ్మాయిలంతా తమ పార్టనర్స్, కాబోయే భర్తలను పరిచయం చేస్తున్నారు. తాజాగా ఈ లిస్ట్‌లోకి తమిళ నటి బ్రిగిదా సాగా ఎంట్రీ ఇచ్చారు. ఈ వివరాల్లోకి వెళితే..

తమిళనాడుకు చెందిన బ్రిగిదా సాగా.. తొలుత ఆహా కళ్యాణం అనే తమిళ సీరియల్‌లో పవి టీచర్‌గా బాగా ఫేమస్ అయ్యారు. ఈ పాపులారిటీతో సినీరంగం నుంచి ఆమెకు అవకాశాలు వచ్చాయి. 2019లో అయోగ్య అనే సినిమాతో వెండితెర మీదకి అడుగుపెట్టారు బ్రిగిదా. ఆ తర్వాత వర్మా, మాస్టర్ సినిమాలలో నటించారు. వెళన్, ఇరవిన్ నిజాల్, గరుగన్, కొజిపణ్ణై చెల్లాదురై, మార్గాన్, ఇడ్లీ కడాయ్, హాట్ స్పాట్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. సింధూరం, పెదకాపు పార్ట్ 1 సినిమాలతో తెలుగు వారిని కూడా ఆకట్టుకున్నారు.

అందరు హీరోయిన్ల మాదిరిగానే బ్రిగిదాపైనా పలు రూమర్స్ వచ్చాయి. ప్రధానంగా తెలుగు డైరెక్టర్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు ఫేమ్ శ్రీకాంత్ అడ్డాలతో బ్రిగిదా రిలేషన్‌లో ఉన్నారంటూ అప్పట్లో వార్తలు వైరల్ అయ్యాయి. తెలుగు, తమిళ ఇండస్ట్రీలలో వీరి వ్యవహారం చర్చనీయాంశమైంది. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో తెరకెక్కిన పెదకాపు సినిమాలో బ్రిగిదా సాగా నటించారు. ఈ సమయంలో వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి ఇద్దరూ రిలేషన్‌లో ఉన్నట్లు గాసిప్స్ వైరల్ అయ్యాయి. అయితే ఇద్దరిలో ఎవరూ దీనిపై స్పందించలేదు.

కానీ తమిళ దర్శకుడు, నటుడు పార్థిబన్ అప్పట్లోనే బ్రిగిదా- శ్రీకాంత్ అడ్డాల వ్యవహారంపై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ మీడియాపై మండిపడ్డారు. ఇదంతా ఒట్టిదేనని, వీరిద్దరి మధ్య ఎలాంటి బంధం లేదని తేల్చేశారు. శ్రీకాంత్ సతీమణి రాగసుధను తానే కోలీవుడ్‌కి పరిచయం చేశానని, ఇలాంటి వాటిని ఆమె అస్సలు పట్టించుకోదేదని పార్థిబన్ తేల్చేశారు. దాంతో శ్రీకాంత్ అడ్డాల- బ్రిగిదాల రిలేషన్ వార్తలకు చెక్ పడింది. ఇద్దరూ ఎవరి సినిమాలతో వారు బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో బ్రిగిదా సాగా సైలెంట్‌గా షాకిచ్చారు. తాను ఒకరితో రిలేషన్‌లో ఉంటున్నానని, ప్రియుడితో ఉన్న ఫోటోను షేర్ చేశారు.

తమిళ నటుడు, యువ హీరో అనంత్ రామ్‌తో తాను రిలేషన్‌లో ఉన్నట్లు తాజాగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించారు బ్రిగిదా. నా చిన్నప్పుడు అందమైన ప్రేమకథలు కేవలం సినిమాలలో ఉంటాయేమో అనుకునే దానిని, కానీ జీవితం నా కోసం అద్భుతమైన, అందమైన కథ రాసింది. నా ఫిలిం జర్నీలో నా లాంటి అభిరుచులు, కలలు ఉన్న అనంత్ నాకు తారసపడ్డాడు. స్నేహంతో మొదలైన మా బంధం ఇప్పుడు ప్రేమ వరకు వచ్చింది. అంతేకాదు.. మేమిద్దరం ఐ లవ్ యూ అని చెప్పుకుని వదిలేసే రకం కాదంటూ బ్రిగిదా రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతుండగా.. సినీ ప్రముఖులు, అభిమానులు, సన్నిహితులు బ్రిగిదా- అనంత్ రామ్ జోడీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. త్వరలోనే గుడ్ న్యూస్ చెప్పాలంటూ ఆకాంక్షిస్తున్నారు. అనంత్ రామ్ కూడా చిన్నా చితకా సినిమాలలో ఇప్పుడిప్పుడే నిలదొక్కుకునే యత్నాల్లో ఉన్నాడు.




# హైదరాబాద్‌లో సల్మాన్ ఖాన్ సందడి.. నయనతార ఎంట్రీతో పెరిగిన అంచనాలు!




బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'ఎస్ఎవీసీ63' షూటింగ్ ఈ వారమే హైదరాబాద్‌లో మొదలు కానుంది. ఈ భారీ షెడ్యూల్ కోసం దర్శకుడు వంశీ పైడిపల్లి ఇప్పటికే నగరంలోని కీలక లొకేషన్లను ఫైనలైజ్ చేశారు. సల్మాన్ రాక కోసం ఇక్కడి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బాలీవుడ్, టాలీవుడ్ కలయికలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తమ నగరంలోనే ఇంత పెద్ద సినిమా షూటింగ్ జరుగుతుండటంతో స్థానిక సినీ ప్రియులు ఖుషీ అవుతున్నారు. షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా ప్లాన్ చేసిన చిత్ర యూనిట్, ఈ వారాంతంలో పనులన్నీ పూర్తి చేసింది. ఈ సినిమా కోసం లేడీ సూపర్ స్టార్ నయనతార తన బిజీ కాల్ షీట్ నుంచి ప్రత్యేకంగా డేట్స్ కేటాయించారు. ఆమె రాకతో ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత స్టార్ వాల్యూ పెరిగింది. షూటింగ్ స్పాట్స్ దగ్గర ఫ్యాన్స్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు కూడా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. హీరోయిన్ డేట్స్ విషయంలో ఉన్న సస్పెన్స్‌కు ఈ అప్‌డేట్‌తో తెరపడింది.

నగరంలోని ఐకానిక్ లొకేషన్లతో పాటు ప్రైవేట్ స్టూడియోల్లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించనున్నారు. దాదాపు మూడు వారాల పాటు ఈ షెడ్యూల్ కొనసాగనుంది. సల్మాన్ ఖాన్ లుక్ లీక్ అవ్వకుండా చిత్ర యూనిట్ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటోంది. సినిమా ఫస్ట్ హాఫ్‌కు ఈ షెడ్యూల్ వెన్నెముక లాంటిదని తెలుస్తోంది. ఇప్పటికే స్టంట్ కోఆర్డినేటర్లు, నటీనటులు హైదరాబాద్ చేరుకుని రిహార్సల్స్ మొదలుపెట్టేశారు. షూటింగ్ కోసం సిద్ధమైన నయనతార సల్మాన్ గ్లోబల్ స్టార్‌డమ్, వంశీ పైడిపల్లి మేకింగ్ స్టైల్ కలిసి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనున్నాయి. సౌత్ ఇండియన్ నేటివిటీ మిస్ అవ్వకుండా మేకర్స్ ప్రతి ఫ్రేమ్‌ను జాగ్రత్తగా డిజైన్ చేస్తున్నారు. సల్మాన్-నయనతార జోడీ మధ్య కెమిస్ట్రీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ కాంబినేషన్ సౌత్ మార్కెట్‌లో సినిమాకు భారీ ఓపెనింగ్స్ తెచ్చిపెడుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. నయనతార ఈ ప్రాజెక్ట్‌లో ఉండటం దక్షిణాది రాష్ట్రాల్లో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. లోకల్ టెక్నీషియన్లతో సందడి సినిమాకు పక్కా రీజినల్ ఫ్లేవర్ తీసుకురావడానికి చాలా మంది తెలుగు టెక్నీషియన్లు ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. వంశీ పైడిపల్లి ఈ చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో విజువల్ వండర్‌గా తీర్చిదిద్దుతున్నారు. స్థానిక టాలెంట్‌ను ప్రోత్సహించడం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత.

# ఆల్ఫా బాక్సాఫీస్ రేస్ ప్రారంభం.. అడ్వాన్స్ బుకింగ్ రెస్పాన్స్ ఎలా ఉందంటే?




బాలీవుడ్ యువ హీరోయిన్లు ఆలియా భట్, శర్వరీ వాఘ్ తమ కొత్త సినిమా 'ఆల్ఫా'తో బాక్సాఫీస్ వద్ద యాక్షన్ మోత మోగించడానికి సిద్ధమయ్యారు. జూన్ 26, 27 తేదీల్లో విడుదలైన కొత్త ప్రోమోలు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. జులై 3న విడుదల కానున్న ఈ సినిమా కోసం దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో వస్తున్న ఈ చిత్రం ఒక సరికొత్త మలుపుగా నిలవనుంది.

ఈ సినిమాలో ఆలియా, శర్వరీ అత్యంత కఠినమైన పోరాట దృశ్యాల్లో నటించారు. ఒక సూపర్ స్పై పాత్ర కోసం ఆలియా భట్ ఎంతో కష్టపడి శిక్షణ తీసుకుంది. శర్వరీతో కలిసి ఆమె చేసే హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనున్నాయి. ముఖ్యంగా మహిళా ప్రధాన యాక్షన్ సినిమాలను ఇష్టపడే ఆడియన్స్‌ను ఈ చిత్రం భారీగా ఆకట్టుకోనుంది.

ఆల్ఫా అడ్వాన్స్ బుకింగ్ ట్రెండ్స్.. ఇండియా వైడ్ రిలీజ్ డీటెయిల్స్

జులై 3న థియేటర్లలో ఈ సినిమా సందడి మొదలుకానుంది. ఇప్పటికే బుక్‌మైషో, పీవీఆర్ వంటి యాప్స్‌లో అడ్వాన్స్ బుకింగ్ అలర్ట్స్ కనిపిస్తున్నాయి. ఫస్ట్ డే ఫస్ట్ షో టికెట్ల కోసం ఫ్యాన్స్ అప్పుడే పోటీ పడుతున్నారు. మెట్రో నగరాలతో పాటు టైర్-2 సిటీల్లోనూ ఈ సినిమాపై భారీ హైప్ కనిపిస్తోంది.

ఆలియా భట్ 'ఆల్ఫా' తెలుగు వెర్షన్.. ఏపీ, తెలంగాణ స్క్రీన్ అప్‌డేట్స్

తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సినిమా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. హిందీతో పాటు తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా భారీ ఎత్తున విడుదల కానుంది. హైదరాబాద్, వైజాగ్ వంటి నగరాల్లో ఐమాక్స్ , పీఎక్స్‌ఎల్ వంటి ప్రీమియం స్క్రీన్లలో ఈ సినిమాను వీక్షించవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రేక్షకులకు వరల్డ్ క్లాస్ విజువల్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ప్లాన్ చేస్తున్నారు.

ఆల్ఫా యాక్షన్ డిజైన్.. స్పై యూనివర్స్‌లో సరికొత్త ప్రయోగం

పఠాన్, టైగర్ సిరీస్ వంటి బ్లాక్ బస్టర్ సినిమాల బాటలోనే 'ఆల్ఫా' కూడా రూపొందింది. అయితే, మహిళా స్పైల కోణంలో కథను నడిపించడం ఈ సినిమా ప్రత్యేకత. భారీ బడ్జెట్, విదేశీ లొకేషన్లు, ఖరీదైన స్టంట్స్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ ఏడాది గ్లోబల్ లెవల్లో స్పై జానర్ సినిమాలకు ఈ చిత్రం కొత్త ఊపునిస్తుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆల్ఫా ఇన్‌స్టాగ్రామ్ ప్రోమోలు.. అప్‌డేట్స్ మిస్ అవ్వకండి

మంచి సీట్లు మిస్ అవ్వకుండా ఉండాలంటే డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో టికెట్ రిమైండర్లు సెట్ చేసుకోవడం మంచిది. లేటెస్ట్ అప్‌డేట్స్, సాంగ్ రిలీజ్ వివరాలు, బిహైండ్ ది సీన్స్ వీడియోల కోసం ఆలియా భట్ అఫీషియల్ ఇన్‌స్టాగ్రామ్ పేజీని ఫాలో అవ్వండి. సినిమా రిలీజ్ కంటే ముందే ఎక్స్‌క్లూజివ్ విషయాలను తెలుసుకోవడానికి ఇది ఫ్యాన్స్‌కు మంచి అవకాశం.

# ది బాయ్ మూవీ రివ్యూ అండ్ రేటింగ్

మర్డర్ కేసులో జైలు శిక్ష అనుభవించిన మేరి లుకా (ఫర్జానా పాలథింగల్) జైలులోనే బిడ్డకు జన్మనిస్తుంది. శిక్షాకాలం పూర్తయిన తర్వాత కొడుకు వాసుదేవ్ (ఆదిశేషన్ కేఆర్)తో కలిసి బయటకు వస్తుంది. తమ ఐడెంటిటీ గురించి తెలియకుండా జాగ్రత్త పడుతూ పలు ప్రదేశాల్లో తలదాచుకొనే ప్రయత్నం చేస్తుంది. ఆ క్రమంలో ఓ వృద్ధురాలి సంరక్షణగా చేరుతుంది. అయితే తన కుటుంబానికి దూరంగా బతుకుతున్న వృద్ధురాలి కోరిక మేరకు చనిపోయిన తర్వాత ఆమె పార్థివ దేహాన్ని తన ఇంటిలోనే పాతిపెడుతుంది. ఈ విషయం తెలుసుకొన్న కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మేరిని అరెస్ట్ చేస్తారు. ఆ సమయంలో వాసుదేవ్ స్కూల్ వెళ్లడంతో తల్లి నుంచి విడిపోతాడు

మేరీ లుకా ఏ పరిస్థితుల్లో హత్య కేసులో ఇరుక్కొన్నది? మారు పేర్లతో తల్లి కొడుకులు ఎందుకు రహస్య జీవితాన్ని కొనసాగించారు? తమ గతం గురించి కొడుకు ఎలాంటి కథలు చెప్పింది? తల్లికి కొడుకు ఎలా అండగా నిలుస్తాడు? తల్లితో విడిపోయిన తర్వాత వాసుదేవ్ పరిస్థితి ఏమిటి? వాసుదేవ్ ఎలా పెరిగాడు? తల్లిని వెతకడానికి ఎలాంటి ప్రయత్నాలు చేశాడు? తల్లి ఆచూకీ కోసం ఎవరెవర్నీ కలిశాడు? వాసుదేవ్ లైఫ్‌లో అబ్బాస్ (టొవినో థామస్) పాత్ర ఏమిటి? తల్లి, కొడుకు ఎలా కలిశారు? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా కథ.

తల్లి, కొడుకుల రహస్య ప్రయాణం, ఐడెంటిటీ తెలియకుండా జాగ్రత్త పడటమనే అంశాలతో కథ చాలా స్లోగా సాగుతుంది. ఈ సినిమా సన్నివేశాల్లో డీటెయిలిటీ ఎక్కువ కావడంతో సినిమా కొంత డాక్యుమెంటరీ టచ్ అనిపిస్తుంది. కాకపోతే 70 ఏళ్ల వృద్ధురాలి క్యారెక్టర్ కథలోకి వచ్చిన తర్వాత కొంత ఫన్‌తో సాగడం ఫీల్‌గుడ్‌గా అనిపిస్తుంది. తల్లి, కొడుకులు విడిపోయిన తర్వాత స్టోరీలో ఎమోషన్స్, సెంటిమెంట్ అంశాలు ఎలివేట్ అయ్యేలా చిదంబరం సినిమాను తెరకెక్కించారు. టొవినో థామస్ అతిథి పాత్రలో కనిపించినప్పటికీ.. సినిమా కథకు అంతగా ఉపయోగపడేలా కనిపించదు. కాకపోతే భావోద్వేగంతో సాగే సినిమాగా ఓ హానెస్ట్ అటెంప్ట్ కనిపిస్తుంది. పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న సినిమాగా హృదయాలను టచ్ చేస్తుంది. ఈ సినిమాను కొంత ఓపికగా చూడాల్సిన పరిస్థితి ఉంటుంది.

నటీనటుల పెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. ఫర్జానా, ఆదిశేషన్ ఇద్దరు మాత్రమే సినిమాను నిలబెట్టారని చెప్పవచ్చు. వారు తమ పాత్రల్లో జీవించడంతో ప్రతీ సన్నివేశం బాగా పండింది. డిఫరెంట్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌ను ఫర్జానా చాలా సులభంగా, అలవోకగా పోషించారు. చిన్నవాడైనా పిల్లాడు తన వయసుకు మించిన పరిణతితో ఆకట్టుకొన్నారు. మిగితా పాత్రల్లో కనిపించిన వారు తమ క్యారెక్టర్ల డెప్త్ మేరకు ఫర్వాలేదనిపించారు. ఈ సినిమాకు ప్రధానంగా సినిమాటోగ్రఫి, మ్యూజిక్ పూర్తిస్థాయిలో సపోర్టుగా నిలిచాయి. బ్యాక్ గ్రౌండ్ స్కోరు సన్నివేశాలను ఎమోషనల్‌గా మార్చాయి. ఆటవీ ప్రాంతం, గ్రామీణ ప్రాంతంలో సాగే సినిమా కావడంతో పల్లె, అడవి అందాలను చక్కగా కెమెరాలో బంధించారు. సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాలను రూపొందించే కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ తొలి ప్రయత్నంగా కంటెంట్ ప్రధానమైన సినిమాతో రావడం కొంత ఆశ్చర్యం కలిగిస్తుంది. అయితే మంచి ఉన్నత నిర్మాణ విలువలతో ఈ సినిమాను అందించారు. చైల్డ్ డ్రామా, మదర్, సన్ రిలేషన్స్, సైకాలజీ సర్వైవల్ థ్రిల్లర్స్ చూడాలనుకొనే వారికి బాలన్: ది బాయ్ చక్కటి ఆప్షన్. కాకపోతే కొంత ఓపికగా చూస్తే మంచి అనుభూతి కలుగుతుంది.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com